భూ క్రమబద్ధీకరణకు చర్యలు ముమ్మరం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన 15 వేల దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లింపుపై నోటీసులు

- ఇందులో జీవో 59కు సంబంధించిన దరఖాస్తులు 10 వేలు
- జీవో 58 నుంచి జీఓ 59కి బదిలీ అయిన దరఖాస్తులు 5 వేలు
- సందిగ్ధంలో జీవో 58 దరఖాస్తుదారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: భూక్రమబద్ధీకరణపై జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకొంటోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 59 జీవో కింద భూక్రమబద్ధీకరణకు అర్హత సాధించిన 15 వేల మంది దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాల్సిన విధి విధానాలపై పేర్కొంటూ.. సంబంధిత రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. సొమ్ము చెల్లింపు నోటీసులు అందుకున్న వారిలో 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న వారు 10 వేల మంది ఉండగా, 58 జీవో నుంచి జీవో 59కి దరఖాస్తులను బదిలీ చేసుకున్న వారు 5వేల మంది ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూ క్రమబద్ధీకరణపై కలెక్టర్ హరీష్ ప్రత్యేక చొరవతో దరఖాస్తుదారుల సొమ్ము చెల్లింపుపై తగిన చర్యలు తీసుకుంటున్నారు.

దరఖాస్తుల పరిశీలన సాగిందిలా..

రాష్ట్రంలో అత్యధికంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 58 జీఓకు సంబంధించి 33,258 దరఖాస్తులు రాగా, జీవో 59 కింద 28,280 దరఖాస్తులు వచ్చాయి.

80 ప్రత్యేక బృందాలతో పరిశీలన...

దాదాపు 3 నెలలు 80 ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత సాధించిన వాటిని జిల్లా కలెక్టర్‌కు అందజేశాయి. జిల్లా అధికార యంత్రాంగం మరోసారి అర్హత సాధించిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను సర్కారుకు నివేదించగా రెవెన్యూ శాఖ పూర్తి స్థాయిలో అర్హత సాధించిన 15 వేల మంది దరఖాస్తు దారులకు వాయిదాల పద్ధతిలో సొమ్ము చెల్లింపునకు నోటీసులు జారీ చేసింది.



జీవో 58 దరఖాస్తులపై సందిగ్ధం..

మేడ్చల్ జిల్లాలో జీవో 58 కింద 33,258 దరఖాస్తు రాగా వాటిని జిల్లా అధికార యంత్రాంగం నియమించిన బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. అయితే ఈ దరఖాస్తుల్లో అర్హత సాధించినవి ఎన్ని? తిరస్కరణకు గురైన దరఖాస్తులు ఎన్ని? ఉన్నాయన్న విషయాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచిన యంత్రాంగం ప్రభుత్వం నిర్ణయంపై ఎదురు చూస్తోంది. జీవో 58 కింద అర్హత సాధించిన దరఖాస్తుల విషయంలో ఏం చేయాలో తెలియని సందిగ్ధ పరిస్థితిలో రెవెన్యూ అధికారులు ఉండగా.. దరఖాస్తు దారులు మాత్రం అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

మండలాల వారీగా జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
కుత్బుల్లాపూర్	14,518
కాప్రాలో	5081
కూకట్‌పల్లి	5055
ఉప్పల్	457
దుండిగల్	1656
మల్కాజిగిరి	1424
బాచుపల్లి	1412
మేడిపల్లి	583
బాలానగర్	389
కీసర	697
ఘట్‌కేసర్	623
శామీర్‌పేట	677
అల్వాల్	346
మేడ్చల్	311
ఎంసీపల్లి	29

'కంటి వెలుగు' చరిత్ర సృష్టించనుంది



కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులతో కలిసి కంటి వెలుగుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

- అవగాహన సమావేశంలో మంత్రి మల్లారెడ్డి
- హాజరైన కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజల బాగోగుల కోసం అనునిత్యం పరితపిస్తున్న సీఎం కేసీఆర్ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టి చరిత్ర సృష్టిన్నారని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కోరారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ హరీష్‌తో కలిసి కంటి వెలుగు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రజలు కంటి సమస్యలతో బాధపడకుండా ఉండేందుకు రూ.250 కోట్లతో కంటి వెలుగు నిర్వహిస్తున్నారని, ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి మల్లారెడ్డి పిలుపు ఇచ్చారు. మేడ్చల్ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో 27 లక్షల మందికి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే తదితరులతో కలిసి మంత్రి కంటి వెలుగుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కంటి వెలుగు కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహా రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కావ్య, జిల్లా వైద్యారోగ్య శాఖ మాస్ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వాహనాల వేలం

మేడ్చల్: ఎక్సైజ్ దాడుల్లో పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం వేలం వేయనున్నట్లు సీఐ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9440902319 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు మల్లారెడ్డి యూనివర్సిటీకి డీజే టిల్లు, దేవిశ్రీప్రసాద్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీకి బుధవారం ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్, యువహీరో డీజే టిల్లు (సిద్దు జొన్నలగడ్డ)లతో పాటు మంత్రి మల్లారెడ్డి విచ్చేస్తున్నట్లు యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని యూనివర్సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కైట్–రంగోళి ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ఇందులో వారు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు వీసీ తెలిపారు.

వాల్తేరు వీరయ్య పాట విడుదల...

యూనివర్సిటీకి వస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్, హీరో డీజే టిల్లు రంగోళి కార్యక్రమం అనంతరం యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న నూతన చిత్రం వాల్తేరు వీరయ్య సినిమాకు చెందిన మరో పాటు రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

శామీర్‌పేట్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని శామీర్‌పేట మండల రిసోర్స్ పర్సన్ సుజాత అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని బొమ్మరాశిపేటలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామ పరిధిలోని ఓ క్రషర్ మెషిన్ వద్ద బడి మానేసిన ముగ్గురు పిల్లలని గుర్తించి బడిలో చేర్పించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయుడు నర్సింగ్‌రావు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం జవహర్‌నగర్‌లోని దేవేందర్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

జాతీయ యువజనోత్సవాలకు 'అనురాగ్' వలంటీర్



విఘ్నేశ్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: కర్ణాటక హుబ్లీలో జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న 26వ జాతీయ యువజనోత్సవాలకు వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) జాతీయ సేవ పథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్ సీఈసీ నాలుగేళ్లుగా చదువుతున్న కె.విఘ్నేశ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అనురాగ్ యూనివర్సిటీ ఉపకులపతి రామచంద్రం, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ప్రొఫెసర్ శ్రీదేవి మంగళవారం వలంటీర్‌ను అభినందించారు.

'మెగా'లో ముగ్గుల పోటీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ మాలతీరెడ్డి

ఘట్‌కేసర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎదులాబాద్ మెగా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మెగా, ఒమెగా విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ కసిరెడ్డి మాలతీరెడ్డి హాజరయ్యారు. పోటీలో విద్యార్థులు వేసిన ముగ్గులు పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కార్పొరేటర్ సాయిని అభినందిస్తున్న యూత్ సభ్యులు

జవహర్‌నగర్: క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందని కార్పొరేటర్ కుతాడ సాయికుమార్ అన్నారు. మంగళవారం దేవేందర్‌నగర్‌లో స్నేహ యూత్ అసోసియేషన్‌కు క్రికెట్ కిట్టును అందజేసి ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత నిస్తోందని, మంత్రి మల్లారెడ్డి సహకారంతో స్థానికంగా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు సిద్దులుయాదవ్, సోమయ్యగౌడ్, యూత్ సభ్యులు తిరుపతి, సురేష్, రమేష్, శ్రీను, మల్లేష్, నాగేష్, శ్రీకాంత్, అక్రమ్, నర్సింహ, ఈశ్వర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట్: సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రూ.5 కోట్ల నిధులతో శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా నుంచి మెడిసిటీ మీదుగా ఘనాపూర్ వరకు నిర్మించనున్న డబుల్ లైన్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో మేడ్చల్ నియోజకవర్గంలో రోడ్లన్నీ అభివృద్ధి చేశానని, నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ గుంతల రోడ్డు లేదని తెలిపారు. గ్రామాల అభివృద్ధితో పాటు రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పథకాలతో ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అనిత, తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుజాత, పలువురు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ పేరు లేకపోవడంతో రసాభాసా...

శిలాఫలకంపై స్థానిక అలియాబాద్ సర్పంచ్ గుర్క కుమార్‌యాదవ్ పేరు ముద్రించకపోవడంతో కార్యక్రమం కొద్దిసేపు రసాభాసాగా మారింది. శిలాఫలకంపై పేపరు ప్రింట్ పేరు ఏర్పాటు చేయడంతో గొడవ సద్దుమనిగింది.

సూపర్‌వైజర్ నుంచి మార్చారన్న మనస్తాపంతో..

హైటెన్షన్ స్తంభం ఎక్కి కార్మికుడి హల్‌చల్





హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కిన కార్మికుడు సత్యనారాయణ

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుడు తనను ఒక శాఖ నుంచి మరోక శాఖకు మర్చారని మనస్థాపం చెంది హైటిన్షన్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కండ్లకోయకు చెందిన సత్యనారాయణ గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. ఆయన కండ్లకోయ వార్డులలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మున్సిపల్ అధికారులు ఆయన్ను సూపర్‌వైజర్ నుంచి తొలగించి ఎలక్ట్రికల్ విభాగంలోకి మార్చారు. సూపర్‌వైజర్‌గా ఉన్న తనను ఎలా మారుస్తారని మనస్థాపం చెందిన కండ్లకోయ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఎక్కి హల్‌చల్ చేశాడు. ఇది గమనించిన కండ్లకోయ వాసులు, సత్యనారాయణ భార్యాపిల్లలు, నాయకులు, పోలీసులు ఘటనా స్థలంకు చేరుకుని స్తంభంపై ఉన్న సత్యనారాయణకు సముదాయించగా ఆయన కిందకు వచ్చాడు. ఇలా గంట పాటు సత్యనారాయణ హల్‌చల్ చేసి చివరకు క్షేమంగా కిందకు దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైస్ చైర్మన్ వేధింపుల వల్లే..

కండ్లకోయకు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ వేధింపు వల్లే తన విద్యుత్ స్తంభం ఎక్కాల్సి వచ్చిందని బాధితుడు సత్యనారాయణ తెలిపాడు. తనపై వ్యక్తిగత కక్షలు పెట్టుకుని ఆయన తరుచూ వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆయన కోరాడు.

గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

శామీర్‌పేట్: అక్రమంగా తరలిస్తున్న 12 కిలోల గంజాయిని మంగళవారం శామీర్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుధీర్‌కుమార్ వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం తూంకుంట నుంచి హైదరాబాద్ నగరానికి గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో శామీర్‌పేట పోలీసులు గస్తీ నిర్వహించారు. తూంకుంట బస్టాండ్‌లో కార్టన్ బాక్స్‌తో ఉన్న వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా 12 కిలోల డ్రై గంజాయి లభ్యమైంది. నిందితుడు ఏపీకి చెందిన శశిధర్ అలియాస్ సాండీ(30), బీటెక్ వరకు చదువుకున్నాడు. కాగా హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటూ పేయింటింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. వైజాగ్‌లో రూ.1500కు కిలోగా కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో రూ.15000 కిలో లాగా అమ్మేందుకు తీసుకు వస్తున్నానని నిందితుడు అంగీకరించాడు. 12 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, నేరస్తుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని చైల్డ్ గైడెన్స్ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగులకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, విజయ్‌ముదిరాజ్, జహంగీర్, అస్లాం, యూసూఫ్, ఫయూమ్, నిఖిల్, భాస్కర్ ఉన్నారు.

రోడ్డు విస్తరణ చేసేదెన్నడు?

మేడ్చల్: జాతీయ రహదారి నుంచి కేఎల్‌ఆర్ కమాన్ వరకు రోడ్డు విస్తరణ ఎప్పుడు చేస్తారని పట్టణ బీజేపీ నాయకుడు జాకట ప్రేందాస్ ప్రశ్నించారు. జాతీయ రహదారి నుంచి కేఎల్‌ఆర్ కమాన్ వరకు రోడ్డు విస్తరణ చేస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రహరీ కూల్చి ప్రభుత్వ స్థలంలో కోర్టు ముందు వరకు రోడ్డు విస్తరణ చేసి వదిలిపెట్టారన్నారు. బాలాజీనగర్‌లో రోడ్డు విస్తరణ చేయకుండా ప్రజలు కష్టాలు పడుతున్నా మున్సిపాలిటీ ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఐటీఐ నుంచి కేఎలార్ కమాన్ వరకు రోడ్డు విస్తరణ చేసి వంద ఫీట్ల రోడ్డు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశాడు.

'పేదలకు రేషన్ బియ్యం అందకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది'



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేదలకు రూ.2లక్షల కోట్లు వెచ్చించి ఉచితంగా బియ్యం అందజేస్తుంటే ఆ బియ్యం పేదలకు దక్కకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కారు 15వ ఆర్థిక సంఘం నిధులు మింగినట్లే రేషన్ బియ్యం కూడా మింగుతున్నారని, నెలలో 5వ తేదీన ఇవ్వాల్సిన బియ్యం 10వ తేదీ దాటుతున్న ఇవ్వడంలేదన్నారు. అధికారులు స్పందించి పేదలకు రేషన్ బియ్యం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ నరేశ్, బాలుయాదవ్, బస్వరాజ్ పాల్గొన్నారు.

ఎస్సీ వైకుంఠధామం అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మేడ్చల్: పట్టణంలోని 7వ వార్డులో గల ఎస్సీ వైకుంఠధామం అభివృద్ధికి రూ.25లక్షలు కేటాయించాలని మంత్రి మల్లారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కౌన్సిలర్ మణికంఠ ఆధ్వర్యంలో ఎస్సీ వైకుంఠ ధామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ నాయకులు మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రి స్పందించి ప్రత్యేక నిధుల కింద మున్సిపాలిటీ నుంచి రూ.25లక్షలు మంజూరీ చేయాలని ఆయన మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు బాలకృష్ణ, యాదగిరి, విజయ్‌కుమార్, శంకర్, జితేందర్, శివకుమార్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతి



గెలుపొందిన టీమ్‌లకు నగదు బహుమతి ఇస్తున్న దృశ్యం

కీసర: కీసర సెరినిటీ పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రథమ విజేతగా నిలిచిన కీసరగుట్ట స్కూల్ టీమ్‌కు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సెరినిటీ స్కూల్ టీమ్‌కు రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కీసర జెడ్పీ హెచ్‌ఎస్ స్కూల్ టీమ్‌కు రూ.2వేల చొప్పున నగదు బహుమతిని మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గుప్తా, జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రావన్‌కుమార్‌గుప్తాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నేతలు చిక్కుడు రమేష్, చినింగని బాల్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని మిరాలంకుంట వద్ద పోచారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా విజేతలకు చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి బహుమతులను అందజేశారు. పోటీల్లో వంద మంది పాల్గొనగా ప్రథమ బహుమతి ప్రియాంక, ద్వితీయ బహుమతి సుప్రియ, తృతీయ బహుమతి శ్వేత, నాల్గవ బహుమతి సంధ్య, ఐదో బహుమతి వనజ గెలుచుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, చింతల రాజశేఖర్, ఆకిటి శైలజ, నల్లవెల్లి లక్ష్మి, సుర్వి సుధాలక్ష్మి, బద్దం మమతా రాణి, మాజీ ఉప సర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఐలయ్య, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు తొలగించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

మేడ్చల్: మండలంలోని గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని మండల ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు విజయానంద్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీశ్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జాయింట్ కలెక్టర్ నర్సింహా రెడ్డిలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. బెల్టు షాపుల వల్ల గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని, చాలా మంది జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. అధికారులు గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చేయాలని వారు కోరారు.

'ఎమ్మార్‌సెట్'లో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో విద్యార్థుల నృత్యాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు కోవల్ ఫ్రెషర్స్ సెలబ్రేషన్స్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ హెచ్‌ఓడీ మధుసుదన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తటాకం రమేష్‌శర్మ మంగళవారం మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి మాసంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్టకు వచ్చే వేలాదిమంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా వచ్చే నెలలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల మొదటి కోఆర్డినేషన్ సమావేశాన్ని ఈ నెల 23వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ హరీష్‌తో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ

ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం సీఎంఆర్‌ఎఫ్

మంత్రి మల్లారెడ్డి



భోగారం లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



జవహర్‌నగర్ 25వ డివిజన్ లబ్ధిదారుకు చెక్కు అందచేస్తున్న మంత్రి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం భోగారం గ్రామానికి చెందిన యాదమ్మకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ 37,500 వేలకు సంబంధించిన చెక్కును మంత్రి లబ్ధిదారురాలికి అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గన్నెర్ల సత్యనారాయణ, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పడమటి నర్సింహా రెడ్డి, జంగాలు తదితరులు పాల్గొన్నారు.

25వ డివిజన్‌కు చెందిన...


జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 25వ డివిజన్‌కు చెందిన శివకుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును మంగళవారం కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్‌తో కలిసి బాధిత కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి అందచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంగూడ గ్రామ వాసికి...

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన లబ్ధిదారులు తడిసిన లక్ష్మీకి రూ.1లక్ష, వరకాంత్‌రెడ్డికి రూ.60 వేల చెక్కులను మంగళవారం మంత్రి మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు మురళీగౌడ్, వీరారెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంగూడ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఎల్‌ఓసీ అందజేత

మేడ్చల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరీ కోసం దరఖాస్తు చేసుకుని సహాయం కోసం ఎదురు చూస్తున్న వ్యక్తికి మంత్రి మల్లారెడ్డి ఎల్‌ఓసీని అందజేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన మధుసూధన్‌రెడ్డికి రూ.1.75లక్షల ఎల్‌ఓసీని మంత్రి తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.